

సర్వాంతర్యామి.. సదా స్మరామి

సర్వాంతర్యామి.. సదా స్మరామి అంటూ ఆ వాడపల్లి వేంకటేశ్వర స్వామిని భక్తజనం కొలిచింది. గోవింద హరి గోవిందా అంటూ మనసారా స్మరించింది.


8లో



బ్యారేజీపై రాకపోకలకు మరో 5 రోజులు బ్రేక్

కాటన్ బ్యారేజీపై మరో ఐదు రోజుల పాటు రాకపోకలు నిలిపివేయనున్నట్లు కలెక్టర్ మాధవీలత తెలిపారు.

డెల్టాలకు 8 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.65 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఈఏపీ సెట్ కార్యాలయం ప్రారంభం



సెట్ కార్యాలయాన్ని ప్రారంభించిన వీసీ ప్రసాదరాజు, డైరెక్టర్లు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే ప్రాంగణంలో ఏపీ ఈఏపీ సెట్–24 కార్యాలయాన్ని చైర్మన్, వర్సిటీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించే ఈ పరీక్షను గతంలో తాము వరుసగా ఏడుసార్లు నిర్వహించామని, మళ్లీ ఈ ఏడాది తమకే ఈ అవకాశం రావడం సంతోషంగా ఉందని అన్నారు. సెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డిని, కో కన్వీనర్లుగా ప్రొఫెసర్ ఎస్.మోహనరావు, డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, ఎస్.సుమతి, ఆర్.మధు, కె.కృష్ణభాస్కర్‌లను నియమించామని వివరించారు. త్వరలో పరీక్ష షెడ్యూల్ విడుదల చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పీఆర్‌ఓ సీహెచ్ సాయిబాబు, డీఈలు బాలకృష్ణ, మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ఎన్నికల నిర్వహణ

కాకినాడ సిటీ: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ, సంసిద్ధతపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా వెలగపూడి నుంచి శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి ఆయా నియోజకవర్గాల ఈఆర్‌ఓలతో కలసి ఆమె పాల్గొన్నారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి వివిధ అంశాల్లో ఇప్పటికే ప్రాథమిక శిక్షణ అందించామని చెప్పారు. ఈ నెలాఖరులోగా పూర్తి స్థాయి శిక్షణ అందిస్తామన్నారు. 1,637 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాటు చేశామని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ఇతర సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు ఫొటో గుర్తింపు కార్డుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పెద్దాపురం ఆర్‌డీఓ జె.సీతారామారావు, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, ఎండీ పి.కృష్ణమూర్తి, కేఎస్ఈజెడ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేవీ రామలక్ష్మి, సీపీఓ పి.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి నిధులివ్వండి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో చర్చిస్తున్న ఎంపీ వంగా గీత

కాకినాడ: జిల్లాలో పర్యాటకాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర పర్యాటక, పురావస్తు, సాంస్కృతిక శాఖల మంత్రి కిషన్‌రెడ్డికి ఎంపీ వంగా గీత విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని ఆమె శనివారం కలిసి, పలు ప్రతిపాదనలపై వినతి పత్రం అందజేశారు. ఉప్పాడ కొత్తపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలకు పెండింగ్ నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇక్కడ విద్యార్థినీ విద్యార్థులకు డిప్లొమా తరగతులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. అన్నవరం దేవస్థానానికి ప్రసాద్ స్కీమ్ మొదటి విడత నిధులు మంజూరు చేయాలని కోరారు. కాకినాడలోని పురాతన ఆర్కియాలజీ మ్యూజియంలో ఉన్న తాళపత్ర గ్రంథాలు, నాణేలు, శిల్పాల భద్రత, మ్యూజియం అభివృద్ధికి ప్రతిపాదించిన రూ.10 కోట్ల ప్రాజెక్టుకు ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఉప్పాడ, తొండంగి, కాకినాడ తీర ప్రాంతాల్లో బీచ్ పార్కుల నిర్మాణాలకు నిధులు విడుదల చేయాలని కోరారు.

అమ్మకు అభయం

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవానికి గర్భిణుల ఆసక్తి
- మౌలిక వసతులు కల్పించిన ప్రభుత్వం
- ఏటా 25 వేల నుంచి 30 వేల వరకూ ప్రసవాలు



ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు చేయించుకున్న తల్లులు

కాకినాడ సిటీ: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నాడు–నేడుతో ప్రభుత్వ ఆస్పత్రుల రూపరేఖలను మార్చేశారు. అన్ని సౌకర్యాలు, అవసరమైన స్థాయిలో మంచి వైద్యులను, సిబ్బందిని నియమించారు. తద్వారా ప్రజారోగ్యానికి మునుపెన్నడూ లేని రీతిలో పెద్ద పీట వేశారు. దీంతో గతంలో ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలంటేనే భయపడిన గర్భిణులు.. ప్రస్తుతం సురక్షిత, సాధారణ ప్రసవం కోసం అక్కడికే వెళ్తున్నారు. ఫలితంగా గతంతో పోలిస్తే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు భారీగా పెరిగాయి. ఒకప్పుడు ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎక్కువగా ప్రసవాలు జరుగుతాయనే భావన ఉండేది. ఇప్పుడు అందుకు భిన్నంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే.. చివరికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ)లో సైతం ప్రసవాలు అధికంగా జరుగుతున్నాయి. గత టీడీపీ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సకాలంలో నిర్వహించరనే అపవాదు ఉండేది. దీనిని ప్రస్తుత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెరిపివేసింది. ఆసుపత్రుల్లో అన్ని సదుపాయాలూ కల్పించింది. అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకోవడం సురక్షితమనే ధైర్యాన్ని మహిళల్లో కల్పించింది. సిజేరియన్లకు కాకుండా సాధారణ ప్రసవాలకే అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో ఎక్కువ మంది గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల వైపు మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా ప్రసవం జరిపిస్తున్నారు. పైగా, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద వీరికి రూ.5 వేల ప్రోత్సాహకం కూడా అందజేస్తున్నారు. ఇవన్నీ ప్రభుత్వ ఆస్పత్రుల వైపు మొగ్గు చూపేలా చేస్తున్నాయి.

జిల్లాలో ప్రసవాలు నిర్వహించే ప్రభుత్వ ఆస్పత్రులు

జిల్లాలో ప్రసవాలు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రులు 63 ఉన్నాయి. వీటిలో 37 పీహెచ్‌సీలు, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీ), 24 గంటలూ పని చేసే పీహెచ్‌సీలు 12, మూడు ప్రాంతీయ ఏరియా ఆస్పత్రులు, ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్) ఒకటి ఉన్నాయి. వీటితో పాటు డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు 23 ఉన్నాయి. వీటిల్లో గడచిన నాలుగున్నరేళ్లలో జిల్లావ్యాప్తంగా 2,70,006 ప్రసవాలు జరిగాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధ్యమైనంత వరకూ సాధారణ ప్రసవం జరిపించడానికి వైద్యులు ప్రయత్నిస్తున్నారు. అది సాధ్యం కాని పక్షంలో మాత్రమే సిజేరియన్ చేస్తున్నారు. కానీ ప్రైవేటు ఆస్పత్రుల్లో మాత్రం కాసుల కోసం సిజేరియన్లకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శ ఉంది.

మారిన ఆస్పత్రుల రూపురేఖలు

నాడు–నేడు కార్యక్రమం ద్వారా ఆస్పత్రుల రూపురేఖలను ప్రభుత్వం సమూలంగా మార్చేసింది. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా, జిల్లా ఆస్పత్రుల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. అన్ని ఆస్పత్రుల్లో ప్రసవాలు నిర్వహించడానికి అవసరమైన కాన్పు గదులు, థియేటర్లను ఆధునీకరించారు. ఆధునిక పరికరాలు సమకూర్చారు. జిల్లాలోనే అతి పెద్ద మాతా, శిశు ఆస్పత్రి అయిన కాకినాడ జీజీహెచ్‌లో అత్యవసర సమయంలో గర్భిణులకు, బాలింతలకు చికిత్స అందించేందుకు ఐసీయూ కూడా అందుబాటులో ఉంది. ఎస్ఎన్‌సీయూ (నవజాత శిశువుల ప్రత్యేక సంరక్షణ కేంద్రం)లో సెంట్రలైజ్డ్ వెంటిలేటర్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. దీనిలో అధునాతన పరికరాలతో వైద్యం అందిస్తున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల వివరాలు

సంవత్సరం	ప్రసవాలు
2019-20	72,489
2020-21	73,894
2021-22	71,679
2022-23	31,847
2023-24	20,697

అధిక ప్రసవాలు



ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల నిర్వహణకు అవసరమైన అన్ని వసతులూ ప్రభుత్వం కల్పించింది. సాధారణ ప్రసవాలకు అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో ప్రసవాలకు గర్భిణులు ముందుకు వస్తున్నారు. గతంలో కన్నా ఇప్పుడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెద్ద సంఖ్యలో ప్రసవాలు జరుగుతున్నాయి.

– డాక్టర్ జె.నరసింహ నాయక్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, కాకినాడ

సంపూర్ణ హక్కుతో మహిళలకు ఇళ్ల స్థలాలు

- **కలెక్టర్** కృతికా శుక్లా, **మాజీ** మంత్రి కన్నబాబు
- **2,812** మందికి పట్టాల పంపిణీ

కాకినాడ రూరల్: నవరత్నాలు – పేదలందరికీ **ఇళ్లు పథకం** కింద అర్హత కలిగిన మహిళందరికీ **సంపూర్ణ** హక్కుతో కూడిన ఇళ్ల స్థలాలను **ప్రభుత్వం** అందించిందని జిల్లా కలెక్టర్ కృతికా **శుక్లా, మాజీ** మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. నియోజకవర్గ పరిధిలో కాకినాడ నగరపాలక సంస్థలోని 8 డివిజన్లకు చెందిన 2,812 మంది లబ్ధిదారులకు శనివారం ఇళ్ల పట్టాలు అందజేశారు. జేఎన్‌టీయూకే ఎదురుగా ఖాళీ స్థలంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ, కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరు చేసిందని చెప్పారు. ఇళ్ల స్థలాలపై శాశ్వత హక్కు కల్పించే లక్ష్యంతో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 1.20 లక్షల మందికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చామని, 75 వేల ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటికే 35 వేల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం ఏకంగా ఊళ్లే నిర్మిస్తున్నారని అన్నారు. అర్బన్‌లోని తన నియోజకవర్గ లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల కోసం మంచి భూములు సేకరించామని చెప్పారు. ఇప్పుడు అందించిన పట్టాల కోసం గురజనాపల్లి లే అవుట్‌లో 174 ఎకరాలు అభివృద్ధి చేశామని, అది మెగా టౌన్‌షిప్‌గా మారనుందని అన్నారు. ఇప్పటి వరకూ నియోజవర్గంలో 31 వేల మందికి ఇళ్ల పట్టాలు అందించామని తెలిపారు. స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నందున ఆస్తిగా భావించి సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యమంత్రి జగన్, తమ పట్ల విశ్వాసం చూపాలని కోరారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ, మహిళల పక్షపాతిగా సీఎం జగన్ పేదలకు విలువైన ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారని చెప్పారు. జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన స్థలాలను లబ్ధిగా కాకుండా హక్కుగా భావించాలని అన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటరావు మాట్లాడుతూ, ఇళ్ల స్థలాలు పొందిన వారికి త్వరలోనే రిజిస్ట్రేషన్లు కూడా చేస్తామని చెప్పారు. అదనపు కమిషనర్ నాగనరసింహారావు మాట్లాడుతూ, లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టాలని కోరారు. తొలుత అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి పట్టాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా నమూనా పట్టాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, కల్యాణ్ కృష్ణ, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లింగం రవి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ జంగా గగారిన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం నేత రావూరి వెంకటేశ్వరరావు, జేఎన్‌టీయూకే ఈసీ మెంబర్ బెజవాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నమూనా పట్టాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తదితరులు

ఫలితం.. త్వరితం

- 'పది' మూల్యాంకనానికి పటిష్ట ఏర్పాట్లు
- ప్రభుత్వ పరీక్షల విభాగం ఉత్తర్వులు
- వచ్చే నెల 18 నుంచి టెన్త్ పరీక్షలు
- మార్చి 31 నుంచి ఏప్రిల్ 8 వరకూ మూల్యాంకనం

రాయవరం: పదో తరగతి పరీక్షలకు సర్వం సన్నద్ధమైంది.. ఫలితాలనూ సరైన సమయానికి ఇచ్చేందుకు పటిష్ట ప్రణాళిక అమలవుతోంది. దీనికి ప్రభుత్వ పరీక్షల విభాగం ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించింది. పదో తరగతి పరీక్షలు పూర్తి కాగానే మూల్యాంకనాన్ని ప్రారంభించి, సకాలంలో ఫలితాలను ప్రకటించే విధంగా ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి షెడ్యూల్ విడుదల చేశారు. పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనానికి సంబంధించి ఇప్పటికే అసిస్టెంట్, చీఫ్ ఎగ్జామినర్ల జాబితాలను జిల్లా విద్యాశాఖ సిద్ధం చేస్తోంది.

పరీక్షల ప్రణాళిక ఇది..

పదో తరగతి పరీక్షల షెడ్యూల్‌ను ఇప్పటికే విడుదల చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. ఫస్ట్ లాంగ్వేజ్‌తో ప్రారంభమయ్యే పరీక్షలు మార్చి 27న సోషల్ పరీక్షతో ముగియనున్నాయి. సోషల్ పరీక్ష ముగియగానే మార్చి 31 నుంచి జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ప్రారంభించి, ఏప్రిల్ 8వ తేదీతో పూర్తి చేస్తారు. మూల్యాంకనాన్ని సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా పరిధి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో 386 పరీక్ష కేంద్రాల్లో పది పరీక్షలు జరగనున్నాయి.


మూల్యాంకనం జరిగేదిలా..

పదో తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని సకాలంలో అందించేందుకు షెడ్యూల్ విడుదల చేశారు. దీని ప్రకారం ఈ నెల 12వ తేదీలోగా జిల్లా ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈఓలు ఏఈ/సీఈ/స్పెషల్ అసిస్టెంట్ల జాబితాను సిద్ధం చేసుకోవాలి. ఈ నెల 22వ తేదీలోగా డీఈఓ కార్యాలయం సబ్జెక్టు, మీడియం వారీగా మూల్యాంకన ఉపాధ్యాయుల సిద్ధం చేయాల్సి ఉంది. సీనియారిటీ ఆధారంగా మూల్యాంకనానికి హాజరయ్యే ఉపాధ్యాయుల జాబితాను ఈ నెల 29న ప్రకటిస్తారు. మార్చి 7న ఉపాధ్యాయ సంఘాల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు. మార్చి 15న అప్‌డేట్ జాబితాను తయారు చేస్తారు. మార్చి 18న ఏఈ, సీఈ, స్పెషల్ అసిస్టెంట్లుగా నియమించిన వారికి ఉత్తర్వులు అందజేస్తారు. సబ్జెక్టుల వారీగా మూల్యాంకనానికి అవసరమయ్యే ఉపాధ్యాయులతో పాటు 30 శాతం ఉపాధ్యాయులను అదనంగా నియమిస్తారు. మార్చి 19 నుంచి 26వ తేదీలోగా ఏఈ, సీఈ, స్పెషల్ అసిస్టెంట్లుగా నియమించిన ఉపాధ్యాయులకు సంబంధిత ప్రధానోపాధ్యాయుల ద్వారా ఉత్తర్వులు అందజేస్తారు. ఇదిలా ఉంటే ఉత్తర్వులకు కట్టుబడి షెడ్యూల్‌ను తప్పనిసరిగా పాటించాలి. 1:1.3 రేషియోలో ఏఈ, సీఈ, స్పెషల్ అసిస్టెంట్లను నియమించాల్సి ఉంటుంది.

పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు

జిల్లా	పరీక్ష కేంద్రాలు	రెగ్యులర్ విద్యార్థులు
కాకినాడ	137	27,856
కోనసీమ	112	18,866
తూర్పు గోదావరి	137	23,681
మొత్తం	386	70,403

ఎవ్వరికీ మినహాయింపు ఉండదు



మూల్యాంకన విధులకు నియమితులైన వారు తప్పనిసరిగా హాజరు కావాలి. ఈ ప్రక్రియలో ఎవరికీ మినహాయింపు ఉండదు. మూల్యాంకన విధులకు హాజరయ్యే వారు కచ్చితంగా నియమ నిబంధనలు పాటించాలి.

– జి.నాగమణి, ఆర్జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

మానవత్వానికి మూలం ఆధ్యాత్మికత

పిఠాపురం: అన్ని మత ధర్మాల్లోని ఆధ్యాత్మికత మానవత్వాన్ని మూలంగా చూపిస్తోందని శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం అధిపతి ఉమర్ ఆలీషా అన్నారు. వార్షిక జ్ఞాన మహాసభల్లో భాగంగా రెండో రోజైన శనివారం నూతన ఆశ్రమ ప్రాంగణంలో జరిగిన ఆధ్యాత్మిక సభలో ఆయన భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. భగవద్గీత, రామాయణం, బైబిల్, ఖురాన్ తదితర అన్ని మత గ్రంథాల్లో ఉండే అద్భుతమైన జ్ఞానశక్తి మానవత్వాన్నే సూచిస్తుందని అన్నారు. ఆధ్యాత్మికత అనేది మానవత్వ విలువలకు మార్గదర్శకంగా ఉంటుందని చెప్పారు. సముద్రంలోని నౌక దిక్సూచి ఆధారంగా ఏవిధంగా గమ్యాన్ని చేరుతుందో.. అదే విధంగా మనిషి కూడా జీవిత సాగరంలో తన జీవన నౌకను ఆధ్యాత్మికత అనే దిక్సూచి ఆధారంగా చేసుకుని పరం అనే పరమాత్మ శక్తిని, ఇహం అనే జీవశక్తిని పొందుతూ ముక్తి పొంది తరించాలని అన్నారు. ఆధ్యాత్మికత, సాత్విక జీవన విలువలు పాటిస్తే అవే జీవన తత్వాన్ని సవ్య దిశలో పయనింపజేస్తాయని తెలిపారు. మానవుడు రాక్షసత్వం వీడి ఈశ్వరతత్వంలో పయనించాలంటే ఆధ్యాత్మిక తత్వాన్ని గ్రహించాలని హితవు పలికారు. పీఠం అందిస్తున్న త్రయీ సాధన అవలంబించడం ద్వారా మనస్సులో చెడు భావనలను నియంత్రించవచ్చని ఉమర్ ఆలీషా అన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య రాణి సదాశివమూర్తి, శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ బుద్ధ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అఖిల భారత భవానీ దీక్షా పీఠాధిపతి శివరామకృష్ణ స్వామీజీ, విశ్రాంత న్యాయమూర్తి విశ్వనాథం, ప్రణయ ఆశ్రమ పీఠాధిపతి సుమిత్రానంద సరస్వతి, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వైస్ చైర్మన్ బొంగరాల రవిచంద్రన్ తదితరులను ఉమర్ ఆలీషా ఆశీర్వదించారు.



ఉమర్ ఆలీషాతో ప్రముఖులు

సీఎం ఉదారత

- బోటు యజమానికి రూ.25 లక్షల సాయం
- కలెక్టర్ సమక్షంలో ఉత్తర్వులు
- ఎమ్మెల్యే ద్వారంపూడి చొరవతో బాధితునికి ఊరట

కాకినాడ: సముద్రంలో చేపల వేటకు వెళ్లి, ప్రమాదవశాత్తూ బోటు దగ్ధమైన ఘటనలో తీవ్రంగా నష్టపోయిన బాధితుడిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉదారత చూపారు. చేపల వేట పైనే ఆధారపడి జీవిస్తున్న ఆ బోటు యజమాని కాటాడి రామకృష్ణ పరమహంసకు రూ.25 లక్షల ఆర్థిక సహాయం విడుదల చేశారు. సంబంధిత ఉత్తర్వులను అతడికి కలెక్టర్ కృతికా శుక్లా, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి శనివారం అందజేశారు. కాకినాడకు చెందిన కాటాడి రామకృష్ణ పరమహంస డిసెంబర్ 1న వేటకు వెళ్లి తిరిగి వస్తుండగా.. భైరవపాలెం వద్ద ఆయన బోటు ప్రమాదశాత్తూ దగ్ధమై సముద్రంలో మునిగిపోయింది. బోటుతో పాటు రూ.8 లక్షల విలువైన మత్స్యసంపదను కూడా రామకృష్ణ పరమహంస కోల్పోయారు. ఆ సమయంలో కోస్ట్‌గార్డు సిబ్బంది, మత్స్యకారులు చొరవ తీసుకుని ఆ బోటులో ఉన్న ఆరుగురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తీసుకువెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం రూ.25 లక్షల ఆర్థిక సహాయం విడుదల చేశారు. ఈ ఉత్తర్వులను కలెక్టర్ సమక్షంలో బాధితుడికి అందించిన అనంతరం ఎమ్మెల్యే ద్వారంపూడి విలేకర్లతో మాట్లాడుతూ, మత్స్యకారుల పట్ల సీఎం జగన్ చూప ఆదరణ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. మునుపెన్నడూ లేనివిధంగా రూ.25 లక్షల సాయం ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గతంలో కూడా వివిధ ప్రమాదాల్లో బోట్లు దగ్ధమైనప్పుడు సీఎం రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించారని, నాలుగు నెలల క్రితం జరిగిన రెండు బోట్ల దగ్ధం అంశాన్ని కూడా ఆయన దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ సహా అనేక విషయాల్లో సీఎం జగన్ అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మ, మత్స్యకార నాయకుడు కాటాడి జానికిరామ్, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు అంకాడి సత్తిబాబు, మాజీ కార్పొరేటర్లు, బోటు యజమానులు పాల్గొన్నారు.



బాధితునికి రూ.25 లక్షల ఆర్థిక సహాయం ఉత్తర్వుల కాపీ అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే ద్వారంపూడి


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి

సర్వాంతర్యామి.. సదా స్మరామి

- భక్తులతో కిక్కిరిసిన వాడపల్లి క్షేత్రం
- రూ.35.77 లక్షల ఆదాయం


వెంకన్న ఆలయం వద్ద అశేష భక్తజనం

ఆత్రేయపురం: సర్వాంతర్యామి.. సదా స్మరామి అంటూ ఆ వాడపల్లి స్వామిని భక్తజనం కొలిచింది. గోవింద హరి గోవిందా అంటూ మనసారా స్మరించింది. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయం శనివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఉదయం స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అర్చకులు అలంకరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి గౌతమీ గోదావరిలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో వేంచేసియున్న క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఏడు వారాల నోము ఆచరిస్తున్న భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు. స్వామివారికి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళం, సేవలు, లడ్డూ విక్రయం, విరాళాలు, ఆన్‌లైన్ సేవల ద్వారా సుమారు రూ.35,77,736 ఆదాయం సమకూరింది. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

పేదల బియ్యం పక్కదారి


శ్రీరామనగరం వద్ద పట్టుకున్న పీడీఎస్ బియ్యం


అమలాపురంలో స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలతో అధికారులు

- అధికారుల దాడులు
- రేషన్ బియ్యం పట్టివేత

రాజానగరం: పేదల బియ్యం పక్కదారి పడుతుండడంతో అధికారులు విస్తృతంగా దాడులు చేస్తున్నారు. అక్రమార్కులపై కేసులు పెడుతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఒకచోట, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లాలో మరోచోట ఈ బియ్యం అక్రమ రవాణా గుట్టును రట్టు చేశారు. ముందస్తు సమాచారంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రాజానగరం శివారు శ్రీరామనగరం వద్ద జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అశోక్ లేలాండ్ ఎకోమెట్ స్టార్ వాహనాన్ని తనిఖీ చేయగా 122 బస్తాలలో 6,100 కిలోల రేషన్ (పీడీఎస్) బియ్యాన్ని గుర్తించామని రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కేవీఎస్‌ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. దీని విలువ రూ. 31.73 లక్షలుగా అంచనా వేశారు. ప్రత్తిపాడుకు చెందిన వాహన యజమాని వెలుగుల కృష్ణ, పార్టనర్ వెలుగుల గురయ్య (బాబ్జి)లు ఖమ్మం జిల్లా కల్లూరు నుంచి గొల్లప్రోలు మండలం బి.ప్రత్తిపాడుకు ఈ బియ్యాన్ని తరలిస్తున్నారు. రేషన్ కార్డులదారుల నుంచి కిలో బియ్యాన్ని రూ. 23కు కొనుగోలు చేసి, బి.ప్రతిపాడు పరిధిలోని చేపల చెరువులకు రూ.26కు విక్రయిస్తుంటారు. ఈ మేరకు వాహన డ్రైవర్ కరణం సద్గురుమూర్తి నుంచి వివరాలు తీసుకుని, డ్రైవర్‌తోపాటు ఇద్దరు రవాణాదారులపై 6ఏ కేసు నమోదు చేశారు. సీఐ నాగరాజు, డీఎస్‌ఓ భాస్కర్, రాజానగరం సీఎస్‌డీటీ సుందర్, కానిస్టేబుళ్లు లోవరాజు, కిశోర్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ సిబ్బంది పాల్గొన్నారు.

అమలాపురంలో 1,200 కిలోలు

అమలాపురం రూరల్: అమలాపురం మార్కెట్ వీధిలో రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. విశ్వసనీయ సమాచారంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులతో కలసి ఒక ఇంటిని తనిఖీ చేయగా 24 బస్తాల్లో 1,200 కిలోల బియ్యం గుర్తించారు. ఈ బియ్యం నడిపూడికి చెందిన అరిగెల వీరాంజనేయులుకు చెందినవిగా గుర్తించారు. అమలాపురం పరిసర ప్రాంతాల్లో రేషన్ కార్డుదారుల నుంచి కిలో రూ.20 చొప్పున కొనుగోలు చేసి రూ.22కు పరిసర గ్రామాలకు చెందిన చేపల చెరువులు, బజ్జీల వ్యాపారస్తులకు వీరాంజనేయులు అమ్ముతున్నాడు. నిందితుడిపై కేసు నమోదు చేశామని రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. రాజమహేంద్రవరం రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని అన్నారు. ఈ తనిఖీల్లో కార్యాలయ సీఐ నాగ వెంకటరాజు, ఎస్సైలు జగన్నాథరెడ్డి, అమలాపురం సీఎస్ డీటీ భారతి తదితరులు పాల్గొన్నారు.

బ్యారేజీపై రాకపోకలకు మరో 5 రోజులు బ్రేక్

కొనసాగుతున్న మరమ్మతులు


కాటన్ బ్యారేజీపై రోడ్డును తడుపుతున్న సిబ్బంది

ధవళేశ్వరం: స్థానిక కాటన్ బ్యారేజీపై రోడ్డు మరమ్మతుల నిమిత్తం మరో ఐదు రోజులపాటు రాకపోకలు నిలిపివేయనున్నట్లు కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. తొలుత ఈ నెల 10వ తేదీ వరకూ బ్యారేజీపై రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం కాంక్రీట్ క్యూరింగ్ నేపథ్యంలో మరో ఐదు రోజులు సమయం కావాలని ఇరిగేషన్ ఈఈ కాశీ విశ్వేశ్వరరావు విజ్ఞప్తి మేరకు గడువును పొడిగించినట్లు కలెక్టర్ వివరించారు. బ్యారేజీపై రూ.2 కోట్ల ప్రతిపాదనలతో జరుగుతున్న పనులు ప్రస్తుతం కాంక్రీట్ క్యూరింగ్ దశలో ఉన్నాయన్నారు. ప్రజలు గమనించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు సాగించాలన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష


పెద్దాపురంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న విద్యాలయ ప్రిన్సిపాల్ కమలం

పెద్దాపురం: పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 9వ తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని విద్యాలయ ప్రిన్సిపాల్ ఆర్.కమలం తెలిపారు. విద్యాలయలో ఖాళీ సీట్లకు గాను జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాల్లో పరీక్ష జరిగింది. 1,587 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, 1,070 మంది హాజరయ్యారు. 517 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాలను మండల విద్యాశాఖాధికారులు శర్మ, చౌదరి, ప్రిన్సిపాల్ కమలం పరిశీలించారు.

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి

తుని రూరల్: తుని మండలం తేటగుంట జంక్షన్ వద్ద లారీ ఢీకొనడంతో ఓ వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందినట్లు రూరల్ ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. శనివారం తేటగుంట గ్రామానికి చెందిన కొల్లి నారాయణమ్మ (60) జాతీయ రహదారి దాటుతుండగా ఈ ప్రమాదం జరిగినట్టు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రత్నగిరికి భక్తుల తాకిడి


సత్యదేవుడు, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరిపై సత్యదేవుని ఆలయం శనివారం కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం, విశ్రాంతి మండపాలు, క్యూలైన్లు నిండిపోయాయి. సత్యదేవుని సుమారు 25 వేల మంది దర్శించారు. స్వామి వారి ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. ఏర్పాట్లను ఈఓ కె.రామచంద్రమోహన్ పర్యవేక్షించారు. కాగా, రత్నగిరిపై సత్యదేవుని ప్రాకార సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై తూర్పు రాజగోపురం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ పండితుల పూజల అనంతరం స్వామి, అమ్మవార్లను ఆలయ ప్రాకారంలో మూడుసార్లు మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను తిరిగి ప్రధానాలయానికి చేర్చారు.